ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
శుక్రవారం 1 మార్చి 2024

రామగుండంలో మురుగునీటి శుద్ధికి 'అమృత్' నిధులు 8లో..

సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై శిక్షణ తరగతులు 8లో..

డీఎస్సీలో పెరిగిన పోస్టులు



- గతంలో 43.. ప్రస్తుతం 93 పోస్టులు
- ప్రత్యేక అవసరాలుగల పిల్లల విద్యా బోధనకు కొత్తగా 17 పోస్టులు
- వయోపరిమితి రెండేళ్లు పెంపు.. పెరగనున్న అభ్యర్థుల సంఖ్య
- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆ మేరకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నది. గత ప్రభుత్వ హయాంలో జారీచేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి 11,062 పోస్టులతో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి విద్యా శాఖాధికారులు, మంత్రులతో కలిసి కొత్త నోటిఫికేషన్‌ను జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా పోస్టుల సంఖ్యను కూడా వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబరు 17న బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో జిల్లాలో 43 పోస్టులను చూపగా, ప్రస్తుతం నోటిఫికేషన్‌లో ఆ సంఖ్య 93కు పెరిగింది. స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్జీటీ పోస్టులతో పాటు కొత్తగా స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీ చేస్తున్నారు.

ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 49, భాషా పండితుల పోస్టులు 5, పీఈటీ ఒక పోస్టు, స్పెషల్ గ్రేడ్ టీచర్ పోస్టులు 21, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 5, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 12 ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో డీఎస్సీ ద్వారా 43 పోస్టులు ప్రకటించగా, ప్రస్తుతం 50 పోస్టులు పెరిగాయి. గతంలో డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఏప్రిల్ 3వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అలాగే దరఖాస్తు చేసుకునేందుకు వయసు మరో రెండేళ్లు అదనంగా పెంచారు. ఓసీ అభ్యర్థులకు 46 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 51 ఏళ్లు, దివ్యాంగులకు 56 ఏళ్ల వరకు అవకాశం కల్పించారు. గతేడాది జూలై 1 నాటికి కట్ ఆఫ్ డేట్ పెట్టారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలి.

● పెరగనున్న అభ్యర్థుల సంఖ్య..

గత ప్రభుత్వ హయాంలో జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటు మరికొంత మంది అభ్యర్థులు పెరగనున్నారు. ఇందుకు కారణం దరఖాస్తు చేసుకునే వారి నిర్దిష్ట వయస్సును 44 ఏళ్ల నుంచి 46 ఏళ్లకు పెంచారు. అంతేగాకుండా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు విద్యా బోధన చేసేందుకు కొత్తగా పోస్టులను ప్రవేశపెట్టారు. దీంతో బీఈడీ, డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసిన వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం లభించింది. జిల్లాలో ఆ పోస్టులు 17 ఉండడంతో వాటి కోసం దరఖాస్తు చేసుకునే వారితో అభ్యర్థుల సంఖ్య మరింత పెరగనున్నది. పాత నోటిఫికేషన్‌లో ప్రకటించిన పోస్టులకు తోడు మరిన్ని పోస్టులను కలిపి నోటిఫికేషన్ జారీ చేయడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని జిల్లాల కంటే తక్కువ పోస్టులు..

ప్రభుత్వం జారీచేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో అన్ని జిల్లాలకంటే పెద్దపల్లి జిల్లాలోనే తక్కువగా 93 పోస్టులు ప్రకటించారు. గత డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు, పీఈటీ పోస్టులు ఉండగా, వాటిలో అదనంగా 33 పోస్టులు పెరిగాయి. కొత్తగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యాబోధన చేసేందుకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు 17 ఉన్నాయి. వీటిని మొట్టమొదటిసారిగా నేరుగా భర్తీచేస్తున్నారు. జిల్లాలో 549 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలకు 2494 పోస్టులు మంజూరుకాగా, 2,224 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, 270 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో జీహెచ్ఎం-2 పోస్టులు 2, స్కూల్ అసిస్టెంట్ గణితం 24, భౌతికశాస్త్రం 6, జీవశాస్త్రం 26, సాంఘిక శాస్త్రం 56, ఇంగ్లీష్ 9, తెలుగు 15, హిందీ 17, ఉర్దూ 2, పీడీ 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భాషా పండితులు తెలుగు 3, హిందీ 2, వ్యాయామ ఉపాధ్యాయులు ఒకటి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం 34, ఎస్జీటీలు 29 పోస్టులు, పీఈటీ ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. మిగతా 30 శాతం నేరుగా భర్తీచేయనున్నారు. ఎస్జీటీ, పీఈటీ, భాషా పండిత పోస్టులను నేరుగా భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన స్కూల్‌అసిస్టెంట్ పోస్టులు 48, ఎస్జీటీలు 29, భాషా పండితులు 6, ఒక పీఈటీ పోస్టు మొత్తం 84పోస్టులను నోటిఫికేషన్‌లో చేరుస్తారని అభ్యర్థులు భావించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఒకటి పెరగా, భాషా పండితులు ఒకటి, ఎస్జీటీ పోస్టులు 8 తగ్గాయి.

పెద్దపల్లి మార్కెట్‌లో క్వింటాలు పత్తికి రూ.7,313

- పది రోజులుగా రూ. 7 వేలు దాటిన ధర



పత్తిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

పెద్దపల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వారంరోజుల నుంచి పత్తి ధరలు పెరగడంతో పత్తి రైతులు పెద్దపల్లి మార్కెట్‌కు పెద్ద ఎత్తున రైతులు పత్తిని తీసుకవస్తున్నారు. గురువారం క్వింటాలు పత్తికి అత్యధికంగా 7,313రూపాయలు పలకగా, మోడల్ ధర 7,121, అత్యల్పంగా 6,011రూపాయల ధర పలికింది. మార్కెట్‌కు 180 మంది రైతులు 836 క్వింటాళ్ల పత్తిని తీసుకవచ్చారు. ఇందులో 6,001నుంచి 6,500 రూపాయల వరకు 17.60 క్వింటాళ్ల పత్తి, 6,501 నుంచి 7 వేల రూపాయల వరకు 275 క్వింటాళ్లు, 7,001 నుంచి 7,500 రూపాయల వరకు 543.40 క్వింటాళ్ల పత్తిని అడ్తిదారులు కొనుగోలు చేశారు. ఈనెల15వ తేదీ వరకు పత్తి ధరలు 7వేల రూపాయలలోపే ఉన్నాయి. ఆ తర్వాత నుంచి 7 వేలకు పైగానే పెట్టి పత్తిని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ధర తక్కువగా ఉండడంతో చాలా మంది రైతులు పత్తిని నిల్వ చేశారు. ప్రస్తుతం చివరి దశకు చేరుకోవడంతో వ్యాపారులు ధర పెంచి కొనుగోలుచేస్తున్నారు. ఈనెల 27న 7,252 రూపాయలు, 28న 7,444 రూపాయల ధర పలికింది. నిన్నటికి ఈరోజుకు 131 రూపాయల ధర తగ్గింది. చివరి దశలో పత్తి ధరలు పెరుగుతుండడంతో రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకు వస్తున్నారు.

ఇంటర్ పరీక్షకు 97.35 శాతం హాజరు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 29 : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరవ మొదటి రోజు పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 5188మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5051 మంది హాజరై 137 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఇంటర్మీడియట్ అధికారులు పేర్కొన్నారు. గురువారం ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, అరబిక్ మొదలగు ద్వితీయ శ్రేణి భాషల పరీక్షలు జరిగాయి. జనరల్, వొకేషనల్ కలిపి 5188 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు రాయాల్సి ఉండగా జనరల్ అభ్యర్థులు 4139 మందికి 4043 మంది హాజరుకాగా 96మంది గైర్హాజరు అయ్యారని, వొకేషనల్ 1049 మందికి 1008 మంది హాజరుకాగా 41మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని నోడల్ అధికారిని కల్పన తెలిపారు. మొత్తంగా జిల్లాలో 97.35 శాతం హాజరయ్యారని సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థిని డీబార్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించని రైస్ మిల్లులపై కొరడా

మంథని, ఫిబ్రవరి 29: భారత ఆహార సంస్థకు బియ్యం అప్పగించని రైస్‌మిల్లుల పట్ల జిల్లా అధికార యంత్రాంగం కొరడా ఝుళిపించింది. సీఎంఆర్ రైస్ డెలివరీ పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ మండలంలోని కూచిరాజ్‌పల్లి గ్రామంలో ఉన్న వెంకటసాయి ఇండస్ట్రీస్, మారుతి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులపై ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగించారని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు వెంకటసాయి ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్టనర్‌లు బోడ సంపత్‌రెడ్డి, సీహెచ్. అశోక్ కుమార్, పార్ట్‌నర్లు బోడ సరోజన, సీహెచ్. స్వర్ణలతలపై, అలాగే మారుతి ఇండస్ట్రీస్ రైస్ మిల్లుల మేనేజింగ్ పార్టనర్ బీప్రకాష్‌రావు, పార్టనర్లు బి వరప్రసాదరావు, ఎం.సుమన్ కుమార్‌లపై పోలీసులు ఐపీసీ సెక్షన్406, 409, 420 కింద కేసు నమోదుచేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ 2022-23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి భారత ఆహార సంస్థకు మంథని మండలం కూచిరాజ్‌పల్లి గ్రామంలో ఉన్న వెంకటసాయి ఇండస్ట్రీస్ రూ.8కోట్ల 50 లక్షల 88వేల 152 రూపాయల విలువగల 27వేల 786.50 క్వింటాళ్ల సీఎంఆర్ రైస్, మారుతి ఇండస్ట్రీస్ రూ.21కోట్ల 64లక్షల 5 వేల 173రూపాయల విలువగల 70వేల893.56 క్వింటాళ్ల సీఎంఆర్ రైస్ మోసపూరిత ఉద్దేశంతో డెలివరీ చేయకుండా ప్రభుత్వాన్ని మోసం చేశారని తెలిపారు. ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం నిందితుల ఆస్తులు జప్తుచేసి వేలం వేసి ప్రభుత్వ నష్టాన్ని భర్తీచేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.

ఆస్తి పన్ను వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 29: ప్రభుత్వం మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90శాతం రాయితీని ప్రకటించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని రామగుండం నగర మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. మార్చి 31లోపు బకాయిలతో సహా పన్ను మొత్తం చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. ఇప్పటికే వడ్డీతో చెల్లించిన వారికి కూడా భవిష్యత్ పన్నుల్లో సర్దుబాటు చేస్తారని ఆయన పేర్కొన్నారు.

రామగుండం సీఐగా అజయ్‌బాబు

జ్యోతినగర్, ఫిబ్రవరి 29 : రామగుండం సీఐగా జి.అజయ్ బాబు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ 2ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అజయ్‌బాబును రావగుండం సీఐగా బదిలీచేయగా ఇటీవలే సీఐగా వచ్చిన ప్రవీణ్‌కుమార్‌ను మల్టీజోన్ 1కు రిపోర్ట్ చేయాలని పేర్కొంటూ బదిలీ చేశారు.

మదర్ థెరిస్సాలో వార్షికోత్సవం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 29 : మండలంలోని పెద్దబొంకూర్ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా విద్యార్థుల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డిప్లొమా విభాగాధిపతులు ఇజాజ్‌ఖాన్, అనిల్, అర్షియా, భరత్, శ్రీధర్, అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగిపై దాడి.. కాంట్రాక్టర్‌పై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 29: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బండారి రవిగౌడ్‌పై దాడికి ఆల్పడిన కాంట్రాక్టర్ బస్వరాజు గంగరాజుపై గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఫరీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి నది ఒడ్డున ఇటీవల జరిగిన సమ్మక్క-సారలమ్మ జాతరకు సంబంధించి పారిశుధ్య పనుల నిర్వహణకు మున్సిపల్ కాంట్రాక్టర్ అయిన బస్వరాజు గంగరాజు లేబర్స్‌ను సరఫరా చేయాల్సి ఉన్నది. 21వ తేదీ రాత్రి షిఫ్టులో జాతర ప్రాంగణంలో పారిశుధ్య పనులు జరగనందున చెత్తాచెదారం పేరుకుపోయింది. అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో పనులు పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ బండారి రవిని మున్సిపల్ అధికారులు ప్రశ్నించారు. ఈనెల 22న బండారి రవి సంబంధిత కాంట్రాక్టర్‌ను చెత్త తొలగించకపోవడంపై అడిగాడు. అదేరోజు రాత్రి జాతరలో విధులు నిర్వహిస్తున్న బండారి రవిపై కాంట్రాక్టర్ గంగరాజు బూతులు తిడుతూ దాడి చేశాడు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు కంట్రాక్టర్ గంగరాజుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఫరీద్ తెలిపారు.

రామగుండం అభివృద్ధికి రూ.130 కోట్లు తెచ్చా..

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని, ఫిబ్రవరి 29: రామగుండం అభివృద్ధికి నెల రోజుల్లో రూ.130కోట్ల నిధులు తీసుకువచ్చినట్టు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండంకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పాత్రికేయులు సహకారాన్ని అందించాలన్నారు. తాను ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత వివిధ శాఖల ద్వారా నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నానన్నారు. గంజాయి రవాణా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని, వినియోగిస్తున్న వారిని కట్టడి చేయడంలో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ శ్రీకాంత్, ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, క్లబ్ ఫౌండర్లు అల్లంకి లచ్చయ్య, వేల్పుల నారాయణ, దాస్యం లక్ష్మయ్య, జక్కం మారుతి, అధ్యక్ష,కార్యదర్శులు పూదరి కుమార్, శ్యాంసుందర్ తదితరులున్నారు.

కొత్త గనుల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- సింగరేణి సీఎండీ బలరాంనాయక్



పంచ్ ఎంట్రీని ప్రారంభిస్తున్న సీఎండీ

రామగిరి, ఫిబ్రవరి 29: సింగరేణి అభివృద్ధితో పాటు నూతన గనులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని సింగరేణి సీఎండీ బలరాంనాయక్ అన్నారు. గురువారం సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో రూ.24 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన సైజర్ క్రషర్స్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రాజెక్టు క్వారీలోని పంచ్ ఎంట్రీ సీమ్ సైజర్‌కు ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిజిగ్నేషన్ ప్రకారం కాకుండా పనిచేసే చిన్నస్థాయి ఉద్యోగికి సైతం గుర్తింపు ఉంటుందన్నారు. సింగరేణిలో నూతన గనుల విస్తరణ విషయంలో ప్రభుత్వం అనుమతులను ఇచ్చిందన్నారు. భవిష్యత్‌లో మ్యాన్ పవర్ పెరిగే అవకాశం ఉంటుందన్నారు. నూతన గనుల ఏర్పాటుతో పాటు నిర్దేశిత లక్ష్యాలను పెంచుకోవాలని పేర్కొన్నారు. అధికారులు, కార్మికులు అనే తేడాలు ఉండకుండా పనివిధానంలో మార్పు రావాలని సూచించారు. సమష్టి కృషితోనే అనుకున్న ఉత్పత్తి, ప్రభుత్వంలో సింగరేణిలో గుర్తింపు లభిస్తోందన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం ఏ అవకాశాన్ని సైతం వదులుకోబోమని స్పష్టం చేశారు. ఉత్పత్తితో పాటు కార్మికుల సంక్షేమం కోసం సింగరేణి కృషి చేస్తోందన్నారు. సింగరేణి కార్మికులకు పిల్లలకు విద్య, వైద్యపరంగా కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా అనేక కార్యాచరణలు అమలు చేస్తున్నామన్నారు. కార్మికుల సౌకర్యాం రూ.10కోట్లతో గోదావరిఖనిలో కార్డియాక్ సెంటర్‌ను నెలకొల్పుతున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్రియ విద్యాలయం కోసం ప్రభుత్వాన్ని కోరినట్లు, అందుకు సానుకూలంగా స్పందన లభించిందన్నారు. కొన్ని ఏరియాల్లో కార్మికులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దానికి సైతం శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, సత్యనారాయణరావు, జీఎం(సేఫ్టీ)గురువయ్య, జీఎం ఎమ్‌వోపీ వెంకటేశ్వర్లు, ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారులు నాగేశ్వర్‌రావు, రాధాకృష్ణ, యూనియన్ ప్రతినిధులు జనక్‌ప్రసాద్, సీతారామయ్య, ఆర్జీ-3 డివిజన్ అధికారులు రఘుపతి, రామారావు, లక్ష్మీనారాయణ, కర్ణ, పద్మరాజు, రవీందర్‌రెడ్డి, వివిధ విభాగల అధికారులు, ట్రేడ్‌యూనియన్ నాయకులు వై.వీరావు, ఎంఆర్‌సీ రెడ్డి, జూపాక రాంచందర్, రవీందర్ రెడ్డిలు పాలొన్నారు.

గ్రామాల్లో గుట్టుగా ఇసుక డంపులు..



పెద్దరాతుపల్లి గుట్ట సమీపంలో ఇసుక డంపు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 29: పెద్దరాత్‌పల్లి, కాల్వశ్రీరాంపూర్ పాండవుల గుట్ట సమీపంలో మానేరు ఇసుక చీకటి దందా జోరుగా సాగుతోంది. పెద్దరాత్‌పల్లిలోని గుట్ట ప్రాంతం, తాటిచెట్ల దగ్గర, పోచమ్మగుడి వద్ద, కాల్వశ్రీరాంపూర్ పాండవుల గుట్ట సమీపంలోని డంపింగ్ యార్డు పక్కన ట్రాక్టర్ల ద్వారా ఇసుకను డంపులు చేసి లారీల ద్వారా తరలిస్తే ట్రాక్టర్ల యాజమనులు సొమ్ము చసుకుంటున్నారు. ఈ విషయంపై సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చిఆన పట్టించుకోవడం లేదని మండల ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలోని పెద్దరాత్‌పల్లి శివారులోని మానేరులోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించి లారీల్లో నింపుతున్నారు. పెద్దరాత్‌పల్లి, చిన్నరత్‌పల్లి గ్రామాల్లోని కొందరు ట్రాక్టర్ యజమానులు రాత్రి సమయంలో మానేరు నుంచి ఇసుకను తరలించి అదే రాత్రి లారీల్లో నింపి పంపుతున్నట్టు గ్రామస్థులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు పెద్దరాత్‌పల్లికి రెండు లారీలు, కాల్వశ్రీరాంపూర్ పాండవుల గుట్ట సమీపంలోని డంపింగ్ యార్డు సమయంలో మరొక లారీ ఇలా రోజుకు మూడు లారీల్లో ఇసుకను నింపి మొట్లపల్లి, కిష్టంపేట, మీర్జంపేట ద్వారా అర్థరాత్రి సమయంలో లారీల ద్వారా అక్రమంగా ఇసుక లారీల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్టు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ అర్ధరాత్రి ఇసుక దందా నెల రోజులుగా నడుస్తున్నట్టు పెద్దరాత్‌పల్లి, చిన్నరాత్‌పల్లి గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇప్పటికే వందలాది లారీల్లో ఇసుకను హన్మకొండ, హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు సమాచారం. గతంలో ఈ ఇసుక చీకటి దందాపై ట్రాక్టర్ల యజమానులను రెవెన్యూ అధికారులు హెచ్చరించినా చీకటి దందాపు ఆపడం లేదు. అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా డంపు చేసి లారీల్లో తరలిస్తున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు గట్టి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి లారీల ద్వారా ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మానేరు పరివాహక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులను అభినందించిన డీఈవో



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో మాధవి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 29 : తెలంగాణ ఆంగ్ల భాష ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాదులోని అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పెల్ విజార్డ్ పోటీలో జిల్లాకు చెందిన విద్యార్థులు రెండవ స్థానంలో నిలువగా జిల్లా విద్యాధికారి మాధవి అభినందించారు. ఈ సందర్భంగా పోటీల్లో నంది మేడారం పాఠశాల విద్యార్థిని జోషిత రెండవ స్థానం, అంతర్గాం కేజీబీవీ పాఠశాలకు విద్యార్థిని అక్షర రెండవ స్థానంలో నిలిచి బహుమతులు పొందారు. విద్యార్థులను ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంగ అశోక్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి మాధవి సన్మానించారు. ఏఎంఓ షేక్, నాగరాజు నందిమేడారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, గైడ్ టీచర్ రాజ్ కుమార్, లతా, అప్పన్నపేట ఆంగ్ల ఉపాధ్యాయులు కనకయ్యతో పాటు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠాపనోత్సవాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 29 : మండలంలోని కాపులపల్లిలో గురువారం గ్రామదేవతల ప్రతిష్ఠాపనోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. గత 27న ప్రారంభమైన ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. కాగా, గురువారం జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపు కవిత శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల చిత్రపటానికి క్షీరాభిషేకం

రామగిరి, ఫిబ్రవరి 29: మరో రెండు గ్యారెంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టడంపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుల చిత్రపటాలకు గురువారం టిటూ సెంటర్ ఐఎన్‌టీయుసీ భవనం వద్ద క్షీరాభిషేకం చేశారు. పబ్బతి రాధారెడ్డి, ఎంపీపీ ఆరెల్లిదేవక్క, గంట వెంకటరమణరెడ్డి, ముస్త్యాల శ్రీనివాస్, బండారి సదానందం, నవీన్, సిద్దం మురళీ తదితరులు పాల్గొన్నారు.

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు సైన్స్‌కిట్స్ పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి మాధవి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 29 : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం సైన్స్ అకాడమీ హైదరాబాద్, టెక్ మహీంద్రా సహకారంతో ఐదు రోజులపాటు శిక్షణ పొందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులకు సైన్స్ కిట్స్‌ను జిల్లా విద్యాధికారి మాధవి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాధవి మాట్లాడుతూ శిక్షణ పొందిన అంశాలను విద్యార్థులకు సులభమైన రీతిలో అందించాలని, సైన్స్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పీఎంషేక్ మాట్లాడుతూ మరింత ఉత్సాహంతో పాఠశాల బోధన అభ్యసన కార్యక్రమాలు జరగాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైన్స్ అకాడమీ ప్రతినిధి డాక్టర్ రేవతి, అమీర్ అలీ సైన్స్ కిట్స్‌ను పాఠశాలలో సమర్థవంతంగా ఉపయోగించుకుని విద్యార్థులలో సైన్స్‌పై జిజ్ఞాసను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.అంజన్ కుమార్ ఎం. నరేష్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కే. సురేంద్ర ప్రసాద్, ఎంటిఎస్.ఇ.సభ్యులు ఎస్. కృష్ణమోహన మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో రోగులకు బెడ్‌షీట్లు కరువు



ఆసుపత్రిలోని బెడ్‌లపై రోగులు వేసుకున్న బెడ్‌షీట్లు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 29: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి 362పడకలకు అప్‌గ్రేడ్ అయినా రోగుల సమస్యలు మాత్రం తీరడం లేదు. రోగులకు కనీసం బెడ్‌షీట్లు కూడా వేయడం లేదు. రెగ్జిన్ పరుపుల మీదనే రోగులను పడుకోబెట్టి చికిత్సను అందిస్తున్నారు. రెండవ అంతస్తులో ఉన్న పడకల్లో రోజూ విడిచి రోజు బెడ్ షీట్లు మార్చాల్సి ఉండగా అసలు బెడ్‌షీట్లే వేయడం లేదు. రోగులే ఇంటి నుంచి బెడ్‌షీట్లు తెచ్చుకొని బెడ్‌పై వేసుకుంటున్నారు. రోగి ఆసుపత్రిలో చికిత్స కోసం అడ్మిషన్ పొందిన రోజునే ఆ బెడ్‌ను శుభ్రపరిచి బెడ్‌షీట్ వేయాల్సి ఉంది. కానీ సిబ్బంది వచ్చిన రోగులను రెగ్జిన్ పరుపుల మీదనే పడుకోబెట్టడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజూ జనరల్ వార్డులను, ఐసీయూలను తనిఖీ చేయాల్సిన ఆర్ఎంవోలు జాడలేకుండా పోతున్నారు. రోగి వద్ద బెడ్‌షీట్‌తోపాటు మందులు పెట్టుకోవడానికి బాక్స్‌లు కూడా ఏర్పాటు చేయాల్సి ఉండగా వాటిని కూడా అందుబాటులో ఉంచడం లేదు. రోగులే బెడ్‌షీట్లు ఇంటి నుంచి తెచ్చుకోవడం, డిశ్చార్జి అయ్యేదాక వాటిని మార్చకపోవడంతో కొత్త రోగాలు ముంచుకొస్తున్నాయి. ప్రతి విభాగంలో ఇదే సమస్య ఉండడంతో కొత్త కొత్త రోగాలు దరిచేరుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాసుపత్రిలో వార్డులను తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్యంపై తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని మోహన్ రావుపేట గ్రామంలో గురువారం వేంకటేశ్వర కల్యాణం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని గుట్టపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు పూజలు నిర్వహించారు. కోరుట్ల జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య - రాజేష్, ఎంపీపీ తోట నారాయణలు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కారుగూరి నర్సయ్య పాల్గొన్నారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 618క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. బుధవారం క్వింటాల్ పత్తి 7,400 పలికింది. ప్రస్తుతం మరో 150 రూపాయలు పెరుగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బందికి సీపీ రివార్డు


కానిస్టేబుల్‌కు నగదు రివార్డును అందజేస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం/ వీణవంక, ఫిబ్రవరి 29: పురుగుల మందు తాగిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ జైపాల్, హోంగార్డు సంపత్‌కు కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి నగదు రివార్డు అందజేసి అభినందించారు .మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన కుర్ర సురేష్ ఇంట్లో గొడవపడి పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి డయల్ 100 కు కాల్ చేశారు. సమాచారం అందకున్నా బ్లూకోల్ట్స్ సిబ్బంది 15 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌ను కానిస్టేబుల్ జైపాల్ తన భుజాన వేసుకుని సుమారు రెండు కిలోమీటర్ల మేర పొలాల గట్ల మీద పరిగెడుతూ గ్రామంలోకి తీసుకొచ్చాడు. అనంతరం అతడిని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించి ప్రాణాలను కాపాడారు. వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు పరిస్థితులకు అనుకూలంగా వ్యవహరించిన కానిస్టేబుల్ జైపాల్, హోంగార్డు సంపత్‌లను పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్, ఫిబ్రవరి 29: మండలంలోని వచ్చునూర్‌లో ఆర్థిక ఇబ్బందులతో ఓ యువ కుడు బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వచ్చునూర్ గ్రామానికి చెందిన బొంగాని రాజు(39) కొన్ని రోజులుగా నరాల బలహీనతతో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో కొన్ని రోజులుగా మనోవేదన చెందుతున్నాడు. రాజు భార్య తన తల్లిగారింటికి వెళ్లింది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున రాజు తల్లి బొంగాని మల్లవ్వ చూసి స్థానికు లకు తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఇల్లందకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని లక్ష్మాజిపల్లె గ్రామానికి చెందిన రావుల రాజుకు పోలీసులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేశారు. ఇటీవల అతడి సెల్‌ఫోన్ పోయింది. దీంతో అతడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సెల్‌ఫోన్ గుర్తించి రాజుకి అప్పగించారు.

మక్తపల్లివాసికి భారత సమ్మాన్ పురస్కారం


చింతం నరేందర్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 29: మండలంలోని మక్తపల్లి గ్రామానికి చెందిన చింతం నరేందర్ ఇటీవల న్యూఢిల్లీలో విధానసభ స్పీకర్ శ్రీరాం నివాస్ గోయల్ చేతుల మీదుగా భారత సమ్మాన్ పురస్కారం అందు కున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన నరేందర్ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. పలు ఇన్నోవేటివ్ జర్నల్స్ మార్కెట్లో విడుదల చేసినందుకు గాను చింతం నరేందర్‌ను ఈనెల 23న ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

అంజన్న ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

● నిధులు దుర్వినియోగం చేశాడని అభియోగం

మల్యాల, ఫిబ్రవరి 29: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వేలం పాటల ఇన్‌చార్జిగా విధులు నిర్వహించిన కె.శ్రీనివాసాచారిని సస్పెండ్ చేస్తూ ఈవో. టి.వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం పరిధిలోని వ్యాపారులు చెల్లించిన టెండర్లకు సంబంధించిన రూ.37.90లక్షలు దేవస్థానం ఖాతాలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ సస్పెన్షన్ వేటు వేశారు. కొండపైన దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు విడతల వారీగా తమ సొమ్ములు దేవస్థానానికి చెల్లిస్తుండగా కొన్నాళ్ల క్రితం ఆ బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసాచారి వాటిని దుర్వినియోగం చేసినట్లు వారం రోజుల క్రితం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆలయ అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు గురువారం సస్పెన్షన్ చేశారు. సస్పెన్షన్‌తో పాటు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఈవో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని లోతుగా విచారణ జరిపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులను కోరుతున్నారు.

గిరిజన క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 29: రాష్ట్రంలోని గిరిజన క్రీడా పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన శాఖ అభివృద్ధి శాఖ అధికారి తెలిపారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, ఆదిలాబాద్ జిల్లా బాలుర మోడల్ స్పోర్ట్స్ పాఠశాల(జాతర్ల), కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని బాలుర పాఠశాల, ఆదిలాబాద్ జిల్లా బాలుర పాఠశాల(ఊట్నూర్), మహబూబ్‌నగర్ జిల్లా కొత్తగూడ బాలుర పాఠశాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా బాలికల పాఠశాల, కొత్తగూడెం జిల్లా కాచనపల్లి బాలికల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. విద్యార్థుల వయస్సు 31-08-2024 నాటికి 9 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలలోపు ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా దేహదారుఢ్య పరీక్షల అనంతరం ఎంపిక చేస్తారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మార్చి 4 నుంచి 6వరకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 90591 75379 నంబరులో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్లు రమణారెడ్డి, పీవీకే కిషోర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 3వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో న్యూరో డాక్టర్ల 8వ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కమిటీ చైర్మన్ డాక్టర్ రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పీవీకే కిషోర్ తెలిపారు. గురువారం నగరంలోని సుభాష్‌నగర్‌లో గల భద్రకాళి ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలు తెలియచేశారు. శుక్రవారం రెనే ఆసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్, అంబర్ డిస్క్ సర్జరీలు, చల్మెడ మెడికల్ కాలేజీలోని న్యూరో విభాగం ఆధ్వర్యంలో మెదడు, వెన్నుపాముకు సంబంధించిన లైవ్ సర్జరీలు ఉంటాయని తెలిపారు. న్యూరో విభాగంలో వచ్చిన అధునాతన వైద్యం గురించి లైవ్ సర్జరీల ద్వారా తెలుసుకుంటారని అన్నారు. మార్చి 2న సాయంత్రం నగరంలోని వీ కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సు న్యూరో డాక్టర్లు, న్యూరో వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

వేములవాడలో జాతర ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ ఫిబ్రవరి 29 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఆలయ ఈఈ రాజేష్, డి ఈ రఘునందన్ లతో కలిసి ఆలయ పరిసరాలలో జాతర ఏర్పాట్లు పరిశీలించి అనంతరం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జాతర సందర్భంగా తాగునీటి సరఫరా, క్యూ లైన్ల నిర్వహణ, ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

నాగేంద్ర సహిత మానసా దేవి యంత్రం ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న భక్తులు, నాగేంద్ర సహిత మానసాదేవి విగ్రహాలు

కోరుట్ల, ఫిబ్రవరి 29 : పట్టణంలోని సత్య అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం నాగేంద్ర సహిత మానసా దేవి యంత్రస్థాపన కార్యక్రమాన్ని వేదపండితుడు పాలెపు రాంశర్మ, వినయ్, కపిల్‌శర్మ మంత్రోచ్ఛరణ మధ్య ఘనంగా సాగింది. ఈ సందర్భంగా వాస్తు దేవతా పూజలతో పాటు నాగేంద్ర సహిత మానసాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్, నిర్వాహకులు గడ్డమీది రాజన్న, మక్కు ధర్మరాజు, దామోదర్ పాల్గొన్నారు.

ఈ నెల14న ఎస్‌యూలో కామర్స్ మీట్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ మల్లేష్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 29: శాతవాహన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మార్చ్ 14న శాతవాహన వికల్ప2024 (కామర్స్ మీట్)ను నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్ గురువారం కామర్స్‌మీట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, పోటీతత్వం పెంపొందించుకోవటానికి శాతవాహన వికల్ప ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందుకే విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అన్ని డిగ్రీ,పీజీ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శాతవాహన వికల్ప-2024 కన్వీనర్ డాక్టర్ డి హరికాంత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే కామర్స్‌మీట్ వల్ల విద్యార్థులు వివిధ అంశాలపట్ల అవగాహన పెంచుకొని నూతన మెలుకువలు నేర్చుకోవచ్చని అన్నారు. కామర్స్ మీట్‌లో గెలుపొందిన విద్యార్థులకు తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ప్రేరణ-2024 రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ విభాగాధిపతి మనోహర్, అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, బి నరేష్, డాక్టర్ పరశురాములు, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ కృష్ణకుమార్, వేణుమాధవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎస్‌టీపీపీ స్టేజ్-1 నిర్మాణం సంపూర్ణం

● 800 మెగావాట్ల రెండో యూనిట్‌కు కమర్షియల్ ఆపరేషన్(సీవోడీ) ప్రకటన

● అందుబాటులో 1600 మెగావాట్లు ● 4న జాతికి అంకితం చేయనున్న ప్రధాని

జ్యోతినగర్, ఫిబ్రవరి 29: ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) స్టేజ్ 1 నిర్మాణం సంపూర్ణమైంది. ఈ ప్రాజెక్టులోని 800 మెగావాట్ల సామర్థ్యం గల 2వ యూనిట్‌ను గురువారం అర్ధరాత్రి(00.00 గంటలు) కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్(సీవోడీ)గా ప్రకటించారు. ఈ యూనిట్ పూర్తిస్థాయి ఉత్పత్తి దశకు చేరుకోవడం, సీవోడీ ప్రకటనతో మొత్తం 1600 మెగావాట్ల(800 మెగావాట్ల 2 యూనిట్లు) మొదటి దశ పూర్తయింది. 800 మెగావాట్ల 2వ యూనిట్‌కు సంబంధించి ఫిబ్రవరి 11న ట్రయల్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఐదు నెలల క్రితమే 800 మెగావాట్ల సామర్థ్యంగల 1వ యూనిట్‌ను సీవోడీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో టీఎస్‌టీపీపీ స్టేజ్ 1 ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణ రాష్ట్రానికే సరఫరా చేస్తారు. స్టేజ్-2లో 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టును నెలకొల్పాల్సి ఉంది. అయితే స్టేజ్ 2కు సంబంధించి కీలకమైన విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకోవాల్సి ఉంది. స్టేజ్ 2కు ఇప్పటికే ఎన్టీపీసీ బోర్డు(బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు) అనుమతి ఉంది. కాగా, మార్చి 4న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజ్ 1ను జాతికి అంకితం చేయనున్నారు. 4న ప్రధాని ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా అక్కడి నుంచే వర్చువల్ విధానంలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారని సమాచారం.

● సుదీర్ఘ కాలం తరువాత

అనేక సవాళ్లు, అవాంతరాల తరువాత తెలంగాణ సూపర్ థర్మల్ ప్రాజెక్టు పూర్తయింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం 4000 మెగావాట్ల ప్రాజెక్టును ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నెలకొల్పాలని పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా 2016లో పునాదిరాయి పడి స్టేజ్-1 మొదట్లో వేగంగా నిర్మాణ పనులు జరిగినా కరోనా, సాంకేతిక కారణాల వల్ల తీవ్ర జాప్యమైంది. 2020-21లోనే ప్రాజెక్టులోని మొదటి, రెండవ యూనిట్లను పూర్తి చేయాలని ప్రణాళికలు రూపొందించినప్పటికీ కరోనా, సాంకేతిక సమస్యలు రావడంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. ఏడాదిన్నర కాలంగా ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగంగా చేయడం ద్వారా స్టేజ్ 1లో రెండు యూనిట్లు ఉత్పత్తి దశకు చేరాయి. రామగుండంలోని తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టిఎస్‌టిపిపి) 800 మెగావాట్ల 2వ యూనిట్ ఉత్పత్తి దశలోకి రావడంతో ఎన్టీపీసీ సంస్థ స్థాపిత సామర్థ్యం 74,758 మెగావాట్లకు చేరింది.



తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు

యువకుడి ఆత్మహత్య



చొక్కాల అరవింద్(ఫైల్)

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 29:తాను ప్రేమించిన అమ్మాయికి వేరే యువకుడితో వివాహం కుదరడంతో మనస్థాపం చెందిన చొక్కాల అరవింద్(20) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మండలం చింతలఠాణా గ్రామానికి చెందిన చొక్కాల లక్ష్మణ్-దేవవ్వ దంపతుల కుమారుడు చొక్కాల అరవింద్ అనే యువకుడు ఓ యువతిని కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. అయితే సదరు యువతికి వేరే అతనితో వివాహం కుదిరింది. తనను కాదని వేరే అబ్బాయిని వివాహం చేసుకుంటుందనే కోపం పెంచుకున్నాడు. దీంతో అరవింద్ సదరు అమ్మాయితో దిగిన ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేయడంతో సమస్య పెద్దదైంది. హైదరాబాద్‌లో ఉన్న అరవింద్‌ను తండ్రి మందలించి ఇంటికి రావాలని కోరారు. ఇంటికి వస్తున్నానని చెప్పిన అరవింద్ వేములవాడ నందికమాన్ సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికి ఎదిగిన కొడుకు ప్రేమ విషయంలో మనస్థాపం చెంది మృతి చెందడంతో కన్నవారు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

కుక్కలదాడిలో 20 గొర్రెలు మృతి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని గాలిపల్లి సమీపంలో కుక్కలదాడిలో 20 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల కాపరుల వివరాల ప్రకారం వల్లంపట్ల గ్రామానికి చెందిన దయ్యాల ఎల్లయ్య, ముద్దాల బాలయ్య, వట్టి ఎల్లయ్య, దయ్యాల లచ్చయ్యలు మేతకోసం గొర్రెలను గురువారం గాలిపెల్లి గ్రామ సమీపంలోకి తీసుకెళ్లారు. అటుగా వచ్చిన కుక్కలు గొర్రెలపై దాడిచేయడంతో 20గొర్రెలు, మేకలు మృతిచెందాయి. సంఘటలలో తమకు దాదాపు రూ. 1.5లక్షల నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గొర్లకాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయనర్సింహరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, ఫిబ్రవరి 29 : ముండలంలోని ఆవునూర్ పరిధిలో గల ఎగువమానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని ఠాణాకు తరలించినట్లు ఆర్‌ఐ శ్యాంకుమార్ గురువారం తెలిపారు. ఇసుక కోసం టోకెన్ తీసుకొని అనుమతి తీసుకున్న స్థలంలో కాకుండా వేరే చోటకు తరలిస్తుండగా పట్టుకొని ఠాణాకు పంపినట్లు తెలిపారు. ట్రాక్టర్లపై చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవం, స్వామివారు (ఇన్‌సెట్‌లో)

బీర్‌పూర్,ఫిబ్రవరి 29: బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలలో చివరి ఘట్టం స్వామి వారి రథోత్సవం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని గుట్టపై నుంచి గుట్ట కిందికి ప్రత్యేకంగా అలంకరించిన శావపై ఆశీనుల గావించి డప్పు చప్పుళ్ల మధ్య గుట్ట కిందికి తీసుకవచ్చారు. రథం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని రథంపై ఆశీనులు గావించి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్ట కింద ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వంటలు చేసుకుని భోజనాలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన ఆరుగురు ఎస్సైలు, ఆరుగురు ఏఎస్సైలు, పోలీసు సిబ్బందితో డీఎస్పీ రఘుచందన్, జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, బీర్‌పూర్ ఎస్సై గౌతమ్ పవర్ ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ జాతర బ్రహ్మోత్సవాలలో ఎంపీపీ మసర్తి రమేష్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్ రావ్, బీర్‌పూర్ సింగిలివిండో చైర్మెన్ కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఆలయ కార్యనిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ ఆలయ చైర్మెన్‌లు గోనే రమణ రావ్, నేరెల సుమన్, మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మధు కుమార్, చిన్న సంతోష్, క్లర్క్ రాజయ్య, సిబ్బంది వెంకటేష్, మల్లయ్య, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కస్టడీలో నందెల్లి మహిపాల్, కృష్ణగౌడ్

● కరీంనగర్‌లో సోదాలు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం



నందెల్లి మహిపాల్‌ను కస్టడీకి తీసుకుని సోదాలకు వెళుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 29: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడిన కేసులో ఈ నెల 20న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు గురువారం ఉదయం కస్టడీకి తీసుకున్నారు. అనంతరం నాలుగు ప్రత్యేక పోలీసు టీంలు ఏకకాలంలో జ్యోతినగర్, శర్మనగర్, ముకరంపురల్లో మహిపాల్ ఇళ్లతో పాటు అతడి అనుచరుల ఇళ్లు, కార్యాలయాల్లో 6 గంటల పాటు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నందెల్లి మహిపాల్ సమక్షంలోనే ఆయన ఇళ్లు, కార్యాలయంలలో సోదాలు జరిపారు. శుక్రవారం ఉదయం వరకు మహిపాల్ పోలీసుల కస్టడీలో ఉండనున్నారు.

● రేకుర్తిలోని ఒక భూమికి సంబంధించి నకిలీ ధ్రువపత్రాలను నిజమైనదిగా చూపించి బాధితుడి నుంచి కోటి 37 లక్షల రూపాయలు వసూలు చేసిన కేసులో నిందితుడిగా జిల్లా జైలులో ఉన్న కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్‌ను గురువారం కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ఈనెల 9న కృష్ణగౌడ్ అరెస్టు అయి జైలులో ఉండగా అతన్ని మరింత లోతుగా విచారించాలని పోలీసులు కోర్టులో కస్టడీ పిటిషన్ వేయగా 24 గంటల కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ మేరకు కృష్ణగౌడ్‌ను కస్టడీకి తీసుకుని విచారణ జరుపుతున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

భూ తగాదాల్లో తలదూర్చిన వ్యక్తిపై పీడీ యాక్ట్



పీడీ యాక్ట్ అమలు కాపీ అందజేస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 29: భూ తగాదాల్లో తలదూర్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన పి.రమణారెడ్డికి గురువారం వేములవాడ పోలీసులు పీడీయాక్టు నిర్బంధ ఉత్తర్వులు అందజేసి అమలుచేసి చర్లపల్లి జైలుకు తరలించారు. చంద్రంపేటకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి రిపోర్టర్‌గా పనిచేస్తూ భూ సమస్యలు, ఇతర సమస్యల్లో తలదూరుస్తూ అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతూ ప్రజలకు భయభ్రాంతులకు గరిచేస్తున్నాడని అతనిపై సిరిసిల్ల, తంగళ్లపల్లి, కోనరావుపేట, వేములవాడ పోలీస్‌స్టేషన్‌లలో దాదాపు 10కేసులు నమోదయ్యాయని పోలీసులు పేర్కొన్నారు. అయినప్పటికీ అతని కార్యకలాపాలు మార్చుకోనప్పటికీ జిల్లా కలెక్టర్ అనురాగ్‌జయంతి పీడీ యాక్ట్ అమలు చేయడానికి ఉత్తర్వులు ఇవ్వగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు అతనికి పీడీ యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు అందజేసి నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం కేసులో పెరుగుతున్న బాధితులు

మరో ఏడుగురి వద్ద రూ. 6లక్షల టోకరా

గంభీరావుపేట, ఫిబ్రవరి 29: అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల ఆశతో మోసపోయిన బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ. 9 లక్షలు దండుకున్న ఘటన మరిచిపోక ముందే ఇదే కోవలో మరికొందరు వెలుగులోకి వచ్చారు. వీరిని మోసం చేసింది కూడా ఎర్రవెల్లికి చెందిన అర్జున్ కావడం విస్మయం కలిగిస్తోంది. ఉద్యోగాల పేరిట వరుస టోకరాలు చూస్తుంటే అర్జున్ చేతిలో ఇంకెంత మంది మోసపోయారనే అనుమానాలు బలపడుతున్నాయి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో పలువురు అమాయక యువకులను మోసం చేసిన వ్యక్తుల్లో ఒకరైన ఎరవెల్లికి చెందిన అర్జున్ గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటకు చెందిన మరో ఏడుగురిని ఇదే రకంగా మోసం చేశాడనే అంశం వెలుగు చూడటం కలకలం రేపుతోంది. అర్జున్ శివ పేరుతో సూర్య, సుజాత అనే వ్యక్తుల సహకారంతో లింగన్నపేటలో మరో ఘరానా మోసానికి తెరలేపాడు. దాదాపు లింగన్నపేటకు చెందిన ఏడుగురు వ్యక్తుల వద్ద కాస్ ఫౌండేషన్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.6 లక్షల వరకు వసూలు చేశాడు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో పెట్టించే అధికారులు సూర్య, సుజాత అంటూ వారిని పరిచయం చేస్తూ అర్జున్ అలియాస్ శివ పలు దఫాలుగా డబ్బు వసూలు చేశాడు. లింగన్నపేటకు చెందిన బాధితురాలు తండ్రి పురుషోత్తం గంభీరావుపేట ఎస్‌ఐ రాంమోహన్‌కు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి నిందితుడైన అర్జున్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అట్రాసిటీ కేసులపై డీఎస్పీ విచారణ


ముస్తాబాద్, ఫిబ్రవి 29: ముస్తాబాద్ మండల పోలీసు ఠాణా పరిధిలో ఇటీవల నమోదైన అట్రాసిటీ కేసులపై సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ గురువారం విచారణ చేశారు. ఎస్టీ మహిళ పెట్టిన కేసుతో పాటు, పారిశుద్ధ్య సిబ్బంది పెట్టిన అట్రాసిటీ కేసులపై క్షేత్ర స్థాయిలో డీఎస్పీ విచారణ చేశారు. ఏఎస్సై వెంకటరమణ, పీసీ కుమార్ ఉన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో 10న మంత్రి 'పొన్నం'కు సన్మానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 29: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో మార్చి 10న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మాన కార్యక్రమం ఉంటుందని జిల్లా గౌడ సంఘం నాయకులు తెలిపారు. గురువారం నగరంలోని మాచర్ల గార్డెన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల గణన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పొన్నం ప్రభాకర్‌కు సన్మాన సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పెద్ద ఎత్తున గౌడ కులస్థులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాచర్ల ప్రసాద్, పొన్నం శ్రీనివాస్, పొన్నం సత్యం, జగన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాలి

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్



సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయకార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 29: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులను గురువారం కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం జరిగి సంవత్సరాలు గడిచిపోయాయని, లబ్ధిదారులను సైతం గ్రామసభల ద్వారా ఎంపిక చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ఇళ్లను పంపిణీ చేయలేదన్నారు. ఓపిక నశించిన లబ్ధిదారులు డబుల్‌బెడ్‌రూంలలో ఉంటున్నారని తెలిపారు. వారికి విద్యుత్ సరఫరా నిలిపివేయడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాలని లేనట్లయితే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘ జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య, నాయకులు పసుల బాలరాజు, బైండ్ల మల్లేశం, మహేష్, నర్సవ్వ, రేణుక, లక్ష్మి, బాగ్యలక్ష్మి, చంద్రయ్య, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు టెట్ అర్హత మార్కులు తగ్గించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే అర్హత పరీక్ష(టెట్)లో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అర్హత మార్కులు తగ్గించాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో అర్హత సాధించాలంటే, ముందుగా బీఈడీ, టీటీసీ చేసిన అభ్యర్థులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో అర్హత సాధించాల్సి ఉందని తెలిపారు. ఈ పరీక్షలో ఓసీలు 90, బీసీలు 75, ఎస్సీలు 60 మార్కులు సాధించాలన్నారు. 89 సాధించిన ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఒక్క మార్కుతో వేల సంఖ్యలో అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. కావున ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు బీసీల మాదిరిగానే 75 మార్కులకే అర్హత కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమస్యపై దృష్టి సారించి ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

చందుర్తి, ఫిబ్రవరి 29: జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ నిరుపేద మృతి చెందగా మృతదేహం చందుర్తి మండలంలోని బండపల్లికి చేరుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోతుగంటి భూమయ్య (46) గుండెపోటుతో ఫిబ్రవరి 3న గల్ఫ్‌లో మృతి చెందా డు. రాత్రి భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటుండగా గుం డెపోటు వచ్చింది. సహచరులు వెంటనే ఆసుపత్రి తరలిం చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతదేహం గ్రామానికి రావడంతో కుటుంబ సభ్యులు రోధించడం కంటతడి పెట్టించింది. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

● పల్లిమక్తలో చోరీ ● రూ.70 వేలు అపహరణ



పల్లిమక్తలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

కోనరావుపేట, ఫిబ్రవరి 29: తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతున్నారు. గత నెలలో కూడా సుమారు నాలుగు గ్రామాల్లో వరస దొంగతనాలు జరిగాయి. అది మరవక ముందే బుధవారం రాత్రి పల్లిమక్త గ్రామంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శనిగరం దేవవ్వ, నందగిరి వజ్రవ్వల ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో చోరీ చేశారు. తాళాలను పగలగొట్టి శనిగరం దేవవ్వ ఇంటిలో 70 వేల రూపాయలను అపహరించారు. నందగిరి వజ్రవ్వ ఇంటిలో కూడా తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆ ఇంటిలో ఏమి దొరకలేదు. విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి దొంగతనం జరిగిన తీరును పరిశీలించి డాగ్ స్కాడ్‌తో గాలింపు చేపడుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రామగుండంలో మురుగునీటి శుద్ధికి 'అమృత్' నిధులు

- మొదటి దశలో 137.79కోట్లతో ఎస్‌టీపీల నిర్మాణాలు - టెండర్ల ప్రక్రియ పూర్తి - మున్సిపల్ భారాన్ని ప్రభుత్వమే భరించాలంటూ ఎమ్మెల్యే లేఖ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 29: రామగుండంలో మురుగు నీరు శుద్ధికి అమృత్ 2.ఓలో రూ.255కోట్ల నిధులు కేటాయించారు. నగరంలోని వ్యర్థ జలాలు నేరుగా గోదావరిలో కలువకుండా శుద్ధి చేసి గోదావరిలోకి వదలాలని ప్రతిపాదనలు చేశారు. పవిత్ర గోదావరి మురుగు గోదావరిగా మారిన పరిస్థితుల్లో ఎస్‌టీపీల నిర్మాణం అనివార్యమైంది. ప్రాజెక్టు క్రింద రూ.255కోట్లు మంజూరైనా ఇందులో నగర పాలక సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం వాటాలను చెల్లించే విషయంలో చొరవ చూపకపోవడంతో ప్రతిపాదనలు ముందుకు కదలలేదు. రూ.255.82కోట్లలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.118కోట్లు, నగర పాలక సంస్థ రూ.46.18కోట్లు ఉంటుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమృత్ పనులకు పచ్చజెండా ఊపడంతో మొదటి దశ పనులకు టెండర్లు పెట్టారు. మొదటి దశలో ఆదిలాబాద్, రామగుండం, కరీంనగర్ నగరపాలక సంస్థల్లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ట్రంక్ మెయిన్ల నిర్మాణాలకు టెండర్లు పిలిచారు. ఇందులో రామగుండానికి రూ.137.79కోట్ల పనులకు టెండర్లు ఖరారు చేశారు.

ఐదు ఎస్‌టీపీలు.. 32కిలో మీటర్ల పైప్‌లైన్లు

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 69120నివాసాలు ఉన్నట్టు లెక్కలు గట్టి అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, ట్రంక్ మెయిన్‌లు, సెప్టిక్ ట్యాంకులు, డైవర్షన్లు, ఎస్‌టీపీలు, 32కిలో మీటర్ల పైప్‌లైన్లు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. దీనిలో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఐదు అత్యాధునిక టెక్నాలజీ స్వీక్వెన్సీ బ్యాచ్ రియాక్టర్(ఎస్‌బీఆర్) టెక్నాలజీతో ఎస్‌టీపీలను నిర్మించనున్నారు. రామగుండం, మల్కాపూర్, పాములపేట, యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతాల్లో ఈ ఎస్‌టీపీల నిర్మాణం జరుగనున్నది. దీనిలో భాగంగా మొత్తం రామగుండంలో రోజుకు 52.5 ఎంఎల్‌డీల మురుగు నీటిని శుద్ధి చేసే ఎస్‌టీపీలు అవసరమని ప్రతిపాదన చేశారు. ఇప్పటికే సింగరేణి సంస్థ 2ఇంక్లైన్ వద్ద 17ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీ నిర్మిస్తుంది. రామగుండం నగరపాలక సంస్థ రామగుండంలో 2ఎంఎల్‌డీల సామర్థ్యం గల ఎస్‌టీపీని నెలకొల్పింది. ప్రమాదకరమైన గోదావరిఖనిలోని మురుగు నీటిని శుద్ధి చేసేందుకు మల్కాపూర్ వద్ద 21ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీని నిర్మించేందుకు ప్రతిపాదన చేశారు. మల్కాపూర్‌లో ఇప్పటికే ఎస్‌టీపీకి 40ఎకరాల స్థలం ఉంది. అదనంగా మరో 3ఎకరాల భూసేకరణ అవసరం ఉంటుందని రూ.3 కోట్లు కేటాయించారు. మల్కాపూర్ ఎస్‌టీపీ పక్కనే ఇప్పటికే సెప్టిక్ ట్యాంకుల నుంచి తీసిన వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ఎఫ్ఎస్‌టీపీని నిర్మించారు. ఇక్కడే 21ఎంఎల్‌డీల సామర్థ్యం గల ఎస్‌టీపీ, ఎఫ్ఎస్‌టీపీల నిర్మాణం జరునున్నది. దీనితో పాటు అదనంగా పాములపేట, యైటింక్లయిన్ కాలనీల్లో సైతం అత్యాధునిక ఎస్‌టీపీలను నిర్మించనున్నారు. నాలాల వద్ద నుంచి వచ్చే వ్యర్థజలాలను సంపుల్లోకి మళ్లించి నీటిని శుద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించారు.


గోదావరిలోకి వెళుతున్న మురుగునీరు


ఎస్‌టీపీ నిర్మాణ ప్రతిపాదిత స్థలంలో వెలసిన ఇళ్లు

ఆ భారాన్ని మీరే భరించండి..

గోదావరి కాలుష్యాన్ని నివారించేందుకు అమృత్ 2.ఓలో సీవరేజ్ ప్రాజెక్టు మంజూరు కాగా నగరపాలక సంస్థ వాటా రూ.46.18కోట్లు భరించాల్సి ఉందని, ప్రస్తుతం ఉన్న నగర పాలక ఆర్థిక పరిస్థితి జీతాలు లేవ్వలేని స్థితిలో ఉన్నందున ఆ భారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ కార్యదర్శులకు కూడా లేఖ ఇచ్చారు. గోదావరి జలాలు కాలుష్యం కావడంవల్ల ఈ ప్రాంత ప్రజలు కలుషిత నీటితో రోగాలబారిన పడుతున్నారని, భవిష్యత్‌లో దాని ప్రభావం హైదరాబాద్ పౌరులపై కూడా పడుతుందని ఆయన పేర్కొంటున్నారు. దీనిని నివారించేందుకు త్వరితగతిన ఎస్‌టీపీలు నిర్మించాలని ఆయన కోరారు. కాగా, రామగుండంలో అమృత్ పథకం క్రింద ఎస్‌టీపీల నిర్మాణానికి సంబంధించి మొదటి దశ టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఈ ప్రాజెక్టును ఏఎంఆర్ - ఐహెచ్‌సీ జాయింట్ వెంచర్ ప్రాజెక్టుకు వచ్చినట్టు తెలుస్తున్నది. త్వరలోనే పనులు మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మించే సంస్థనే రెండేళ్ల పాటు నిర్వహణ కూడా చేపట్టనున్నది.

ఎస్‌టీపీల్లో భూపోరాట నిర్మాణాలు

నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ప్రభుత్వం గోదావరి కాలుష్యాన్ని నివారించేందుకు రామగుండంలో ఎస్‌టీపీల నిర్మాణానికి నిధులు మంజూరుచేసింది.మరోవైపు మల్కాపూర్ ఎస్‌టీపీలో సీపీఎం ఆధ్వర్యంలో భూపోరాటాలకు సంబంధించి నిర్మాణాలు వెలిశాయి. ఈ స్థలంతో పాటు అదనంగా 3ఎకరాలు అవసరం ఉంటాయని ప్రతిపాదనలు చేశారు. మరోవైపు ఉన్న స్థలంలోనే నిర్మాణాలు జరగడం చర్చనీయాంశంగా మారింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిని బయటికి తీస్తాం

- టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే

మంథని, ఫిబ్రవరి 29: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతి, అక్రమాలను బయటకు తీసి ప్రజల ముందు పెడతామని టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే అన్నారు. గురువారం కాచే విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందన్నారు. అప్పుడు సీఎంగా ఉన్న కేసీఆర్ ఎందుకు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు జరిగే సమయంలో కాంక్రీట్ వర్క్ జరిగేటప్పుడు నిబంధనలు పాటించకపోవడం వల్లనే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవ విషయాలు తెలియజేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసును విజిలెన్స్‌కు అప్పగించిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పుట్ట మధుకు ప్రజలు ఓటు ద్వారా తీర్పునిచ్చారన్నారు. కేసీఆర్ ప్రాజెక్టు సందర్శనకు వచ్చి నష్టపోతున్న రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎంపీపీ కొండ శంకర్, వైస్‌ఎంపీపీ కొమ్మిడి స్వరూప్, కాంగ్రెస్ నాయకులు పోలు శివ, పెరవేన లింగయ్య యాదవ్, బూడిద శంకర్, బాపు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సేవారత్న అవార్డుకు ఇనుముల సతీష్ ఎంపిక

మంథని, ఫిబ్రవరి 29: సేవారత్న నేషనల్ అవార్డు 2024 సంవత్సరానికి మంథనికి చెందిన సంఘ సేవకులు, వికలాంగుల హక్కుల సంఘం నాయకుడు, ఇనుముల సతీష్ ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటీ గురువారం ప్రకటించారు. ఈ మేరకు అవార్డు సెలెక్షన్ కమిటీ ఛైర్మన్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వానం పత్రాన్ని హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఇనుముల సతీష్‌కు అందజేశారు. కాగా మార్చి 3న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే బహుజన రైటర్స్ 7వ కాన్ఫరెన్స్ సందర్భంగా సేవారత్న నేషనల్ అవార్డులను అందజేయనునట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు మామిడాల సంతోష్‌రెడ్డి, కాంట్రాక్టర్ ముస్కుల లోకేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'కోరుకంటి'ని పరామర్శించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఫిబ్రవరి 29: రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గురువారం పరామర్శించారు. చందర్‌కు పితృవియోగం కలగడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కోరుకంటి మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చందర్‌ను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ముస్తాఫా, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, కౌటం సతీష్, బొమ్మక రాజేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్ష..

ధర్మారం, ఫిబ్రవరి 29: ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షకేంద్రంలో 327మంది విద్యార్థులకు 325మంది విద్యార్థులు హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. ఆదర్శ కళాశాల పరీక్ష కేంద్రంలో 287మందికి 283 మంది విద్యార్థులు హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారు.

ఉద్యోగం నుంచి తొలగింపు.. పారిశుధ్య కార్మికుడికి అస్వస్థత

కోల్‌సిటీ, ఫిబ్రవరి 29: రామగుండం నగరపాలక సంస్థలో ఆగ్రోస్ ద్వారా కొనుగోలుచేసిన వాహనాలపై పని చేస్తున్న తనను తొలగించారనే మనస్థాపంతో ఆవు నూరి మురళి(35) అస్వస్థకు లోనయ్యాడు. అతని భార్య గౌరి తెలిపిన సమాచారం ప్రకారం మురళి మధ్యవర్తికి డబ్బులు చెల్లించి కార్పొరేషన్ పారిశుధ్య వాహనాలపై కొలువులో చేరాడు. ఇప్పుడు పనులు లేవంటూ వెళ్లగొట్టారని, తమకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

పదవీ బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 29: సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గాజుల లక్ష్మీ రాజమల్లు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో రిజష్టర్లలో సంతకాలు చేశారు. పాలకవర్గంలో కొనసాగి, అనారోగ్యంతో మృతిచెందిన పూసాలకు చెందిన కౌన్సిలర్ సిద్ధ కనుకయ్యకు నివాళులర్పించారు.

పౌర హక్కులపై అవగాహన


పాలితంలో మాట్లాడుతున్న అధికారులు


మేడిపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ కుమారస్వామి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 29 : దళితులను కులం పేరుతో దూషిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పాలితం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా గ్రామంలో దళితులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి తహసీల్దార్ రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో దళితులపై పెత్తానం చేయరాదన్నారు. రెస్టారెంట్, వేడుకల సంబంధిత అంశాల్లో దళితులను రెండు గ్లాసుల పద్ధతిలో వ్యవహరించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్, మామిడిపల్లి బాపయ్య, ఎంపీటీసీ లక్ష్మీ-రాజేశం, ఆర్ఐ నవీన్‌రావు, ఏపీవో రమేష్‌బాబు, ఎఎస్‌డబ్ల్యూఓ జైపాల్‌రెడ్డి, ఏఈవో శిరీష, పంచాయతీ కార్యదర్శి గీతాంజలితో పాటు పలువురు పాల్గొన్నారు.

జ్యోతినగర్ : ఎవరైనా కుల వివక్షత చూపిస్తే చట్ట ప్రకా రం కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం తహసీల్దార్ కుమార స్వామి, మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్ స్పష్టం చేశారు. గురువారం మేడి పల్లి రైతు వేదికలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతినెల 30న సివిల్ రైట్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ నిధులు ఆ వర్గాలకే ఖర్చు చేస్తున్నామన్నారు. కులాంతర వివాహం చేసుకుంటే ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తున్నదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వినోద్, మండల వ్యవసాయ అధికారి ప్రకాష్, సోషల్ వెల్ఫేర్ అధికారి సాయికుమార్, కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధర్మారం : మండలంలోని పత్తిపాకలో గురువారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో కుల మతాల విభేదాలు లేకుండ కలిసికట్టుగా ఉండాలని తహసీల్దార్ రజిత చెప్పారు. ఈ కార్య క్రమంలో ఎస్సై సత్యనారాయణ, సింగిల్‌విండో ఛైర్మన్ నోముల వెంకటరెడ్డి, దళితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఓదెల : దళితులను కులం పేరుతో ఎవరైనా దూషిస్తే ఫిర్యాదుల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ యాకయ్య తెలిపారు. మండలంలోని శానగొండ ఎస్సీ కాలనీలో గురువారం పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా, సమావేశాన్ని నిర్వహించారు. హోటళ్లలో, వివాహ వేడుకల్లో రెండు గ్లాసుల పద్ధతి అలాగే ఎస్సీలపై చిన్న చూపు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. అనంతరం అంటరానితనంపై దళితులను విచారించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి తిరుపతి, ఆర్ఐ నర్సింగరావు, వైస్ ఎంపీపీ జీల తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, ఎస్సీ కుల పెద్దలు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండలంలోని ముప్పిరితోట గ్రామంలో గురువారం అధికారులు సివిల్‌రైట్స్‌డేను నిర్వహించారు. గ్రామంలో మౌళిక వసతుల కల్పనపై ఆరాతీశారు. రెండుగ్లాసుల సిద్ధాంతాలకు స్వస్తి పల కాలని అలాంటివి చట్టం దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. కులమతాలకు అతీతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ అనిల్‌రెడ్డి, ఏఎస్సై భాస్కర్, సోషల్‌వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్ఐ శైల జ, అంబేద్కర్ సంఘం నాయకులు జల్లి రమేష్, అల్లి రమేష్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుర్తి : రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. మండలం గురువారం పరిధిలోని గుడిపెల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు చేపట్టి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పోల్సాని శశికళ, ఎంపీవో షబ్బీర్ పాషా, అర్ఐ పోచం, పుట్నూర్ ప్రత్యేకాధికారి జూహెద్ ఖాన్, సీసీ కుమార్, సీఏ సుకన్య, పంచాయతీ కార్యదర్శి రొయ్యల రాంకిశోర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : ఎవరికైనా భూమి సమస్యలుంటే తనను సంప్రదిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ జాహెద్‌పాషా అన్నారు. మండలంలోని మంగపేట గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, వ్యవసాయ భూముల సమస్యలున్నా మా దృష్టికి తీసుకురావాలన్నారు. పిల్లలను పనిలో పెట్టకుండా బాగా చదివించాలని తల్లి దండ్రులను కోరారు. రోగాలు దరిచేరకుండా ఉండాలంటే మన ఇంటి పరిసరాలతో పాటు వాడలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత విషయంలో గ్రామస్థులు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. కాలనీలో తాగునీటి సమస్య ఉంటే సంబంధిత కార్యదర్శికి గానీ, ప్రత్యేక అధికారికి గాని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాంమ్మోహనచారి, ఎంఈవో రాజన్న, వ్యవసాయ అధికారి నాగార్జున, వెటర్నరీ డాక్టర్ సునీత, ఎస్ఐ ఓంకార్, ఆర్ఐ నరసింగారావు, ఏఎన్ఎం విజయ, గ్రామస్థులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


పత్తిపాకలో మాట్లాడుతున్న తహసీల్దార్ రజిత



వీకేపీ గనిని సందర్శించిన జీఎం సేఫ్టీ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 29: ఆర్జీ-2 పరిధిలోని వకీల్ పల్లె గనిని గురువారం సింగరేణి సేఫ్టీ జీఎం గురువయ్య సందర్శించారు. మ్యాప్ దారా గనిలోని పని స్థలాలను పరిశీలించారు. 3వ సిప్ టాప్ సెక్షన్‌లో నడుస్తున్న కంటిన్యూయస్ మైనర్ పనిస్థలాలను తనిఖీచేశారు. భద్రత పాటిస్తూ ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. ఆర్థిక సంవత్స రం దగ్గర పడతున్న దృష్ట్యా రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా బొగ్గు ఉత్పత్తి చేయాలని ఉద్యోగులకు జీఎం సేఫ్టీ గురువయ్య సూచించారు. గురువయ్య వెంట ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, పీవవో శ్రీనివాసరెడ్డి, ఎస్వోటూ జీఎం బచ్చ రవీందర్, గని మేనేజర్ రవికిరణ్ ఉన్నారు.

సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై శిక్షణ తరగతులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 29: సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ తయారీ, అమలుపై శిక్షణ తరగతులు గురువారం సింటార్స్ శిక్షణ కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఎక్స్‌ప్లోరేషన్ విభాగం అధికారులకు రెండు రోజుల పాటు ఈశిక్షణ తరగతులు జరగనన్నాయి. జీఎం సేఫ్టీ గురవయ్య శిక్షణా తరగతులను ప్రారంభించారు. సింగరేణిలో ఎక్స్‌ప్లోరేషన్ విభాగంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, చేసే పనులను భద్రతతో చేయాలని సూచించారు. పూర్తి బాధ్యతతో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ప్రకారం పనులు చేయాలని సూచించారు. అన్ని విభాగాల్లో ఎస్ఓపీ తయారుచేసి అమలు చేయనున్నట్టు గురువయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించబడి రుజువైన ఈపద్ధతి ఎక్స్‌ప్లోరేషన్ విభాగంలో కూడా తయారుచేసి అమలు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ఎస్ఓపీపై అవగాహన పెంపొందించుకోవాలని అధికారులకు గురువయ్య సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, జీఎం ఎక్స్‌ప్లోరేషన్ శ్రీనివాసరావు, ట్రైనింగ్ మేనేజర్లు ఏకేకే శర్మ, విజయ్‌కుమార్‌తో పాటు కొత్తగూడెం రామగుండం రీజియన్‌ల అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడతున్న జీఎం సేఫ్టీ

కార్మికవాడల్లో సీఎండీ పర్యటన

గోదావరిఖని, ఫిబ్రవరి 29: సింగరేణి సీఎండీ బలరాంనాయక్ గురువారం రాత్రి కార్మిక వాడల్లో పర్యటించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ విజ్ఞప్తి మేరకు స్థానిక తిలక్‌నగర్‌డౌన్‌లో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్‌మెంట్ పనులను సీఎండీ పరిశీలించారు. సింగరేణి పాఠశాల భవనాన్ని పునరుద్ధరించి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

పూర్తి స్థాయిలో యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి


వీల్‌లోడర్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణరావు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 29: యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు సూచించారు. గురువారం ఓసీపీ-1 ప్రాజెక్టులో నూతన వీల్ లోడర్‌ను ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించా రు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడారు. ప్రాజెక్టు అవ సరాల దృష్ట్యా కొమట్స్ కంపెనీకి చెందిన 6.4 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంగల వీల్ లోడర్‌ను 4.83 కోట్లు వెచ్చిం చి కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, సోలార్ జీఎం జానకిరాం, ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్‌ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి, ఏఐటీయూసీ ప్రతినిధి డీటీ రావు, ఏరియా ఇంజ నీర్ ఎలీషా, పీవో రాధాకృష్ణ, పీఈ శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్‌హరిజన్, బేస్‌వర్క్‌షాప్ ఇంచార్జి సత్యనారాయణ, కొమస్తు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎండీని సన్మానించి లద్నాపూర్ గ్రామస్తులు

రామగిరి, ఫిబ్రవరి 29: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో పలు కార్యక్రమాలకు హాజరైన సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను గురువారం ఓసీపీ-2 ప్రధాన రహదారిలో లద్నాపూర్ గ్రామస్తులు శాలువతో సత్కరించి పూలమొక్కను అందజేశారు. తమ గ్రామస్థుల సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు.

ఈ కార్యక్రమంలో పోన్నం సత్యనారయణ, బండారి సదానందం, లద్నాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ధర్మారం, ఫిబ్రవరి29: మండలంలో మార్చి3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నందిమేడారం ప్రాథమిక వైద్యాధికారి సుష్మిత కోరారు. ఐదేళ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని ఆమె సూచించారు. పోలియో చుక్కలు వేయించడం ద్వారా అంగవైకల్యం నుంచి కాపాడుతుందని ఆమె వివరించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరు విజయవంతం చేయడానికి సహకరించాలని ఆమె కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ధర్మారం, ఫిబ్రవరి29: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నరేంద్రమోదీ యువకేంద్రం సంఘటన్ సభ్యుడు, పెద్దపల్లి బీజేపీ ఎంపీ టికెట్ ఆశిస్తున్న మాతంగి హన్మయ్య ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. పెద్దపల్లి నుంచి ఆయన చేపట్టిన పాదయాత్ర ధర్మారానికి చేరుకుంది. ఈ సందర్భంగా ధర్మారంలో అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. నరేంద్రమోదీని మరోసారి ప్రధానమంత్రిగా గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

●ఎలిగేడు: మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి గ్రామాల్లో గురువారం బస్తి సంపర్క్ అభ్యాస్‌లో భాగంగా బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాలరెడ్డి, ఎస్సీ కాలనీలో ఇంటింటా తిరుగుతూ ప్రధాని నరేంద్రమోదీ పథకాలను ప్రచారం చేశారు. దేశంలో పేదవారి అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. పీఎం సమ్మాన్ నిధుల ద్వారా గుంట నుంచి 5ఎకరాల రైతులకు రూ.6వేలు వారి ఖాతాలలో జమ చేస్తున్నారని అన్నారు. ఉచిత రేషన్‌ను ఐదు ఏళ్ల పాటు ఉచితంగా రేషన్ కార్డుదారులకు అందిస్తున్నారు. నరేంద్రమోదీ మరోసారి ప్రధానమంత్రిగా గెలుపొంది చరిత్ర సృష్టిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసంపల్లి రవీందర్, బోజ్జ రాజయ్యయాదవ్, భాస్కర్‌రెడ్డి, కామర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 29: ఇటీవల క్యాన్సర్‌తో మరణించిన గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ గాలి సంతోష్(సతీష్) కుటుంబానికి గురువారం గోదావరిఖని ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సహాయం అందించింది. అసోసియేషన్ ద్వారా విరాళంగా సేకరించిన 33,030 రూపాయలను మృతుడి కూతురు, కొడుకుకు అసోసియేషన్ గౌరవ సలహాదారుడు భైరం సతీష్, అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేష్, కోశాధికారి బండారి ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గూడురు శ్యాంసుందర్, దుస్స మహేష్, తోగటి శ్రీధర్, గూడెల్లి శ్రీనివాస్, రామగిరి శ్రీనివాస్, గడమల్ల రఘు, మోర విక్రమ్, గూడురు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 29: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీఠాకూర్ అన్నారు. గురువారం గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ హైస్కూల్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని, విద్యార్థులు విద్యలో రాణించాలన్నారు. యువత మంచి మార్గంలో పయనించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులు జీవితంలో మంచి స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్ మట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో అలరించాయి. ట్రస్మా ప్రతినిధులను సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.జ్యోతి, ఎంఈవో సంపత్‌రావు, ట్రస్మా జిల్లా, రామగుండం నాయకులు పి.అంజారెడ్డి, సిహెచ్ తిరుపతిరెడ్డి, సమ్మారావు, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గట్ల రమేష్, నయిమోద్దిన్, తార ఆర్ట్స్ జాతీ య అధ్యక్షులు ఎస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులో వడ్డీ రాయితీ

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 29: ఆస్తి పన్ను బకాయిలున్న వారికి వడ్డీ రాయితీ అవకాశం కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటీఎస్ ద్వారా ఆర్టీ నంబర్ 101 ప్రకారం వడ్డీ మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ అవకాశం మార్చి 31 వరకు ఉన్నట్లు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'గృహ జ్యోతి'ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేయాలి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేసి, ఉచిత విద్యుత్తు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పెద్దపల్లి జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్కుల సునీల్‌రెడ్డి, దుగ్యాల శ్రీనివాస్‌రావులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలకు సంబంధించిన విద్యుత్ బకాయిలను కూడా రద్దు చేయాలని ఈసందర్భంగా వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని చీకురాయి రోడ్, సెంట్ ఆన్స్ స్కూల్, బండల్ ఏరియా, రామచంద్రమిషన్‌లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

అభివృద్ధి పనుల్లో పర్యవేక్షణ లోపం

-ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కొత్తపల్లిలో సీసీ రోడ్డుపై పోసిన మట్టి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 29 : పెద్దపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులు చేపడుతుండగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపల్లి గ్రామంలో ఇటీవల చేపట్టిన మురికి కాలువ నిర్మాణం గతంలో ఉన్న సీసీ రోడ్డు కంటే ఎక్కువ ఎత్తులో ఉంది. దానిని కప్పిపుచ్చుకునేందుకు సదరు కాంట్రాక్టర్ ఏకంగా సీసీ రోడ్డు కనపడకుండా మట్టిని పోస్తున్నాడు. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు వాపోతున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ

పాలకుర్తి, ఫిబ్రవరి 29:అమ్మ అనుగ్రహం ఉంటే అన్ని ఉన్నట్లేనని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. గురువారం మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అమ్మవారికి బోనం ఎత్తి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను పట్టు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమలో ఎంపీటీసీ పాత భాగ్యలక్ష్మి రవీందర్, తాజా మాజీ సర్పంచ్ కట్టెకోళ వేణుగోపాల్‌రావు, మానసాని శ్రీనివాస రెడ్డి సద్గుణ, అయోధ్యసింగ్, పర్శవేణి శ్రీనివాస్, బయ్యపు మనోహర్ రెడ్డి, ముక్కెర శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరు విడుదల

ఓదెల, ఫిబ్రవరి 29: పంటలకు రైతులు సాగునీటిని సమన్వయంతో వినియోగించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి కోరారు.గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు ఆదేశం మేరకు వెదురుగట్టు టన్నెల్ నుంచి కాంగ్రెస్ నాయకులు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సారెస్పీ సాగునీటిని విడుదల చేయించారు. ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలాల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో పొత్కపల్లి సింగిల్‌విండో ఛైర్మన్ సుమన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సదయ్య, డైరెక్టర్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.